ప్రజాశక్తి

సోమవారం 17 ఫిబ్రవరి 2025 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

ప్రతి రైతుకు యూనిక్ ఐడి

- గుర్తింపు నెంబర్ ఉంటేనే పథకాలు వర్తింపు
- తొలిదశలో కృష్ణాజిల్లాలో 1.49 లక్షల మంది పిఎం కిసాన్ లబ్ధిదారుల నమోదు
- కౌలు రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

వ్యవసాయ రంగంలోనూ డిజిటలైజేషన్ మొదలైంది. దీనిలో భాగంగానే ఆధార్ కార్డులాగానే రైతులకు 11 అంకెలు గల రైతు విశిష్ట గుర్తింపు కార్డు (ఫార్మర్ రిజిస్ట్రేషన్ నంబర్) నమోదులో జిల్లా యంత్రాంగం బిజీ అయింది. రైతులకు అందించే ప్రభుత్వ పథకాలకు ఈ సంఖ్యను ముడిపెట్టడంతో పిఎం కిసాన్ నగదు విడుదలయ్యేనాటికి నమోదు పూర్తి చేయడానికి కసరత్తు చేస్తోంది. రిజిస్ట్రీ పూర్తయితే రుణాలు మంజూరు, ఇతరరత్రా ప్రభుత్వం నుంచి కౌలు రైతులకు అందే అరకొర ప్రయోజనాలకు గండి పడుతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

కృష్ణాజిల్లాలోని 390 రైతు సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కె)ల్లో ఫార్మర్ రిజిస్ట్రీ నంబర్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానించబడిన మొబైల్, పట్టాదార్ పాస్‌బుక్‌లు ఆధారంగా నమోదు ప్రక్రియ చేస్తున్నారు. 1,85, 876 మంది భూమి ఉన్న రైతులు నమోదు చేయించుకోవాలి. ప్రభుత్వ పథకాలతో ముడి పెట్టడంతో పిఎం కిసాన్ అందుకుంటున్న 1,49,760 మంది రైతులకు తొలి దశలో నమోదు పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 39, 529 మంది రైతులు నమోదు చేయించుకున్నారు. వీరిలో పిఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్య 20, 739 మాత్రమే ఉంది. ఈ క్రమంలోనే నిర్ధేశించిన గడువులోపు నమోదు పూర్తి చేయడానికి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.



అవనిగడ్డ మండలం మోదుమూడిలో రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

కౌలు రైతుల్లో ఆందోళన

కృష్ణాజిల్లాలోని రెండు లక్షల మందికిపైగా ఉన్న కౌలు రైతులు అత్యధిక విస్తీర్ణంలోని వ్యవసాయ భూములను సాగు చేస్తున్నారు. 2024-25 వ్యవసాయ సీజన్‌లో 72 వేల మందికి మాత్రమే క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు (సిసిఆర్‌సి)ని అందించారు. ఏడు వేల మంది కౌలు రైతులు రూ. 40 కోట్ల వరకు బ్యాంకు రుణాలు అందుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సందర్భాల్లోనూ సిసిఆర్‌సి ఉన్న కౌలు రైతులకు పంట నష్ట పరిహారం అందుకుంటున్నారు. రాయితీ విత్తనాలు, ఇతరత్రా పథకాలకు ఈ కార్డులు ఉపయోగపడుతున్నాయి. తాజాగా భూ యజమానులకు ఫార్మర్ రిజిస్ట్రీ నంబర్ నమోదు చేయడంతో కౌలు రైతుల ప్రయోజనాలకు గండి పడుతుందని ఆందోళన చెందుతున్నారు.



సింగ్‌నగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు బాబూరావు, తదితరులు

శాసనమండలికి మేథావులను ఎన్నుకోండి

- పట్టభద్రులు ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగొద్దు
- ఎపి ప్రజలను మరోసారి వంచించిన మోడీ సర్కార్
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-విజయవాడ

రానున్న కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల్లో పట్టభద్రులు ప్రలోభాలకు, ఒత్తిళ్లకు, భ్రమలకు లొంగకుండా చైతన్యవంతంగా వ్యవహరించి మేథావులను ఎన్నుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు పిలుపునిచ్చారు. విజయవాడ అజిత్‌సింగ్ నగర్ తదితర ప్రాంతాల్లో బాబూరావు స్థానిక సిపిఎం నేతలతో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. పట్టభద్రులను కలుసుకుని శాసనమండలి ఎన్నికల్లో చైతన్యంతో ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లాగా (మిగతా 2లో)



దుర్గాపురంలో పట్టుబడిన గంజాయి, నిందితులు (ఫైల్ పాటో)

గుప్పుమంటున్న గంజాయి

- విజయవాడ కేంద్రంగా విక్రయాలు
- వారం రోజుల్లో 18 కిలోలు పట్టివేత
- మొక్కుబడి అరెస్టులతో నియంత్రణ సాధ్యమేనా?

ప్రజాశక్తి-విజయవాడ

గంజాయి విక్రయానికి విజయవాడ అడ్డాగా మారింది. మాదకద్రవ్య రహిత నగరంగా చేయడమే ధ్యేయమని పోలీసు అధికారులు వెల్లడిస్తున్న క్రమంలోనే గంజాయి విక్రయాలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. వీటికి ప్రత్యక్ష సాక్ష్యమే ఇటీవల తరుచుగా గంజాయి విక్రయదారులను పోలీసులు అరెస్ట్ చేస్తూ వారి వద్ద నుంచి కిలోల కొద్దీ గంజాయిని స్వాధీనం చేసుకోవడమే. ఈ నెల 8వ తేదీన సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గాపురంలో గంజాయి కలిగి ఉన్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని, 9న అజిత్‌సింగ్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నందమూరి నగర్ ఏరియాలో ఒక మహిళతో పాటు మరొక వ్యక్తిని అరెస్ట్ చేసి రూ.లక్ష విలువ చేసే 18 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇదే రీతిలో ఇటీవల కాలంలో తరుచూ గంజాయి పట్టివేత కేసులు సర్వసాధారణం అయ్యాయని పోలీసుల రికార్డులే విధితం చేస్తున్నాయి. రైల్వేస్టేషన్, పిఎన్ బస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలు, సింగ్‌నగర్‌లోని పలు డివిజన్లు, కృష్ణలంక పరిసర ప్రాంతాలు, డాక్టర్ వైఎస్ఆర్ జక్కంపూడి కాలనీ తదితర ప్రాంతాల్లో గంజాయికి కొదవే లేదని స్వయంగా పలు పోలీస్‌స్టేషన్లలోని సిబ్బందే చెబుతున్నారు. ప్రధానంగా విశాఖ ఏజెన్సీ, ఒరిస్సా బోర్డర్ అటవీ ప్రాంతం నుంచి గంజాయి (మిగతా 2లో)



విజయవాడలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన ఎపి మాజీ ప్రజాప్రతినిధుల ఫోరం కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పెన్షన్ విధానం అమలు చేయండి

చంద్రబాబుకు మాజీ ప్రజాప్రతినిధుల లేఖ

వార్త మెయిన్‌లో

ప్రజావాణి వినిపించేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలే

శాసన మండలిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి -బాపట్ల

ఈ నెల 27న జరుగనున్న ఉమ్మడి గుంటూరు, కృష్ణాజిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు పదవీకాలం ఈ ఏడాది మార్చితో ముగుస్తుంది.ఆయన ఐదోసారి ఎమ్మెల్సీ ఎన్నికల పోటీలో ఉన్నారు. 2007లో తొలిసారిగా శాసనమండలికి ఎన్నికైన లక్ష్మణరావు 2014 వరకు ఎమ్మెల్సీగా కొనసాగారు. .2015లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్సీగా పోటీ చేసి లక్ష్మణరావు ఓడిపోయారు. తిరిగి 2019లో పిడిఎఫ్ తరపున పోటీ చేసి విజయం సాధించారు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్సీగా గెలుపొందారు. తాజాగా ఐదోసారి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు శాసన మండలిలో ప్రజావాణి వినిపించడంలో ముందుంటున్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు కూడా ప్రజాసమస్యల పరిష్కారానికి శాసన మండలిలో కృషి చేశారు. ఈ ఎన్నికలకు సంబంధించి గత ఏడాది సెప్టెంబరు నుంచే ఓటరు జాబితా ప్రక్రియను అధికారులు చేపట్టారు. గత ఏడాది డిసెంబర్ లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తుది జాబితాను విడుదల చేశారు. మొత్తం మూడు లక్షల 48 వేల 529 మంది పట్టభద్ర ఓటర్లు ఉన్నారు. ఇందులో అత్యధికంగా గుంటూరు జిల్లా నుంచి ఒక లక్ష 7,613 మంది ఓటర్లు ఉన్నారు. ఏలూరు జిల్లాలో అత్యల్పంగా 16, 077 మంది ఓటర్లు ఉన్నారు. బాపట్ల జిల్లాలో 24,447 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పల్నాడు జిల్లాలో 56,964 మంది ఓటర్లు ఉండగా, (మిగతా 2లో)



ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఐద్వా నేత ఉమాదేవికి నివాళి

ప్రజాశక్తి-విజయవాడ

అజిత్ సింగ్‌నగర్‌కు చెందిన సిపిఎం కార్యకర్త, ఐద్వా నేత బత్తిన ఉమాదేవి (82) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. ఉమాదేవి భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబురావుతో పాటు పలువురు నేతలు సందర్శించి నివాళు లర్పించారు. ఉమాదేవి భర్త బత్తిన రామ్మోహన్‌రావు (రాము)తో కలిసి దశాబ్దాల పాటు ప్రజలకు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో బాబూరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ ఐదు దశాబ్దాల పాటు సిపిఎం, కమ్యూనిస్టు సిద్ధాంతానికి కట్టుబడి ఉమాదేవి, రాము దంపతులు పని చేయటం గర్వకారణమన్నారు. ఒడిదుడుకులు వచ్చినా ఎదుర్కొని వృద్ధాప్యంలో సైతం విశ్రమించకుండా ఉద్యమాల్లో పాల్గొనడం ఆదర్శప్రాయమన్నారు. పునరావాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సిపిఎం ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు సాగించారన్నారు. మహిళల హక్కుల పరిరక్షణకు అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు. రాజకీయాల్లో విలువలు పతనమవుతున్న ఈ రోజుల్లో సిద్ధాంతాలకు అంకితమై కమ్యూనిస్టులు కృషి సాగిస్తున్నారన్నారు. విజయవాడ నగరాన్ని బుడమేరు ముంపు నుండి కాపాడటానికి ప్రభుత్వాలు శాశ్వత చర్యలు చేపట్టాలన్నారు. ఉమాదేవి స్ఫూర్తితో మహిళలు మరింతగా ఉద్యమించాలన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు, మహిళా సంఘం నగర మాజీ కార్యదర్శి వి.అరుణ, సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, కార్యదర్శివర్గ సభ్యులు కె దుర్గారావు, కాశి బాబు, వివేకానంద, వెంకటరెడ్డి, పిచ్చమ్మ, మురహరి, బొంగు రాంబాబు, పున్నారావు, నాగార్జున, సాంబి రెడ్డి తదితరులు ఉమాదేవికి నివాళులర్పించారు.





ఉమాదేవికి నివాళులర్పిస్తున్న సిపిఎం, ఐద్వా నాయకులు

విలేకరిపై దాడికి ఖండన

ప్రజాశక్తి-విజయవాడ

పార్వతీపురం మన్యం మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై ఆ మండల టిడిపి అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడు చేసిన దాడిని జర్నలిస్టు సంఘాల నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో ఖండించారు. వెంకంపేట నుండి కాశీపట్నం వెళ్లే నూతన రహదారి వద్ద వేణుగోపాల్‌నాయుడిని కలవడానికి వెళ్లిన విలేకరి రామారావుపై టిడిపి నేత బూతులు తిట్టడమే కాకుండా చేయిచేసుకున్నాడు. అధికార పార్టీ నాయకుల తప్పొప్పులను ప్రజలకు తెలియజేయడం ప్రజాస్వామ్యంలో పత్రికల ప్రధాన విధి అని, ఈ విధిని నిర్వహిస్తున్న విలేకరిపై దాడి చేయడం, ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన చర్య అని ఎపిడబ్ల్యుజెఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎంబి నాథన్, ఎపియుడబ్ల్యూజె విజయవాడ అర్బన్ అధ్యక్ష కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నాయకులు వీర్ల శ్రీరామ్‌యాదవ్ వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

మొదటిపేజీ తరువాయి

శాసనమండలికి మేథావులను ఎన్నుకోండి

పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గాల్లోనూ కోట్లాది రూపాయలు కుమ్మరించి గెలవడానికి కొందరు ప్రయత్నిస్తూ అవినీతిమయం చేస్తున్నారని విమర్శించారు. శాసనమండలిలో వివిధ రంగాలకు చెందిన పెద్దలు, మేథావులు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని ప్రధాన రాజకీయ పక్షాలు వమ్ము చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఓటర్ల చేర్పు మొదలు ఓట్లు వేయించే వరకు ధనమయం చేసి రాజ్యాంగ విలువకు విఘాతం కల్పిస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా విద్యావంతులు, నిరుద్యోగులు, వివిధ తరగతుల ప్రజలు డబ్బు సంచులతో ప్రభావితం చేసే చర్యలను తిప్పికొట్టి ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ ఎన్నికల్లో ప్రజలను వంచించే రీతిలో కేంద్ర బడ్జెట్‌ని వినియోగించుకోవడం గర్హనీయమన్నారు. 140 కోట్ల మంది సామాన్యులకు నయా పైసా పన్నులు తగ్గించకుండా దేశ ప్రజలను వంచించే రీతిలో కేంద్ర బడ్జెట్ ఉండటం సిగ్గుచేటన్నారు. దేశంలోని వంద మంది బడా కార్పొరేట్ సంస్థలపై పన్నులు విధించి, 140 కోట్ల మందికి పైగా ప్రజలకు పన్నులు తగ్గించవచ్చని చెప్పారు. సాధారణ ప్రజల కొనుగోలు శక్తి పెంచే రీతిలో చర్యలు తీసుకోవచ్చన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ, పెట్రోలు, డీజిల్‌పై పన్నులు, సెస్సులు, అప్పుల భారాలతో సామాన్యులను కొల్లగొట్టే విధానాలను కొనసాగించిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు మరోసారి కేంద్రం మొండిచేయి చూపిందన్నారు. రాజధాని అమరావతికి బడ్జెట్లో నిధులు కేటాయించకుండా అప్పులతో సరిపెట్టిందన్నారు. విభజన హామీల అమలు ఊసే ఎత్తలేదన్నారు. భవిష్యత్తులో ఎన్నికల జరగబోయే బీహార్ తదితర రాష్ట్రాలపై రాజకీయ దృష్టి తప్ప, ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకునే చిత్తశుద్ధి ప్రదర్శించలేదన్నారు. దేశం ఎదుర్కొంటున్న ఉపాధి, ధరల పెరుగుదల తదితర సమస్యలకు పరిష్కారం చూపలేదన్నారు. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీదేవి, సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణరావు, నాయకులు కె.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

గుప్పుమంటున్న గంజాయి

భారీ ఎత్తున రైళ్లలో, బస్సుల్లో, ఇతర ప్రయివేటు వాహనాల్లో ఈ ప్రాంతానికి దిగుమతి అవుతుంటుందని పోలీసు అధికారులు సైతం బాహాటంగానే చెబుతున్నారు. కొందరు ఒక సిండికేట్‌గా ఏర్పడి ఈ ప్రాంతానికి వచ్చిన సరుకును మొత్తాన్ని స్వాధీనం చేసుకు కిలోల కొద్దీ ఆయా ప్రాంతాలకు తరలిస్తూ అత్యంత జాగరూకతతో వ్యాపారం నిర్వహిస్తున్నారు. అయితే ఇంత భారీస్థాయిలో విచ్చలవిడిగా గంజాయి వ్యాపారం జరుగుతుందంటే దాని వెనుక సంబంధిత వ్యక్తులకు రాజకీయ అండతో పాటు పలువురు పోలీసుల అండకూడా లేకపోలేదనే చర్చ జోరుగా సాగుతుంది. గంజాయి కేసుల టార్గెట్ కోసమో ఉన్నత స్థాయి అధికారుల నుంచి వచ్చే ఒత్తిడులకో ఏదో మొక్కుబడిగా గంజాయి విక్రయదారులపై దాడులు చేసి, వారి వద్ద నుంచి పోలీసులు స్వాధీనం చేసుకునే సరుకు నూటికి పదో వంతు కూడా ఉండదనే సమాచారం వినవస్తుంది.

ఒక వైపు గంజాయి, మరొక వైపు మద్యం తీవ్ర ప్రభావం చూపిస్తున్నారు. ప్రతి నియోజకవర్గ స్థాయిలో పదుల సంఖ్యలో మద్యం షాపులు, వీధివీధికి బెల్టు షాపుల వ్యాపారం నిరాటంకంగా 24 గంటల పాటు యధేచ్ఛగా నడుస్తుంది. మద్యం మత్తులో రెచ్చిపోతున్న మందుబాబుల ఆగడాలు, అల్లర్లతో ప్రతీ పోలీస్టేషన్ పరిధిలో కేసుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఎంతో కాలం నుంచి ప్రశాంతంగా ఉండే ప్రాతాంల్లోనూ మద్యం షాపులకు అనుమతులిస్తూ ఆ ప్రాంతాలను అశాంతికి, ఘర్షణలకు నిలయంగా తయారు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కృష్ణలంక ప్రస్తుత 22వ డివిజన్ సత్యంగారి హోటల్ సమీపంలో 'లెగాసి' పేరుతో మద్యం షాపును నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతం అనాది నుంచి ఎంతో ప్రశాంతంగా ఉందని, ఈ షాపు అనుమతిని రద్దు చేయాలని వామపక్షాలు, ఈ ప్రాంత ప్రజలు పలు రూపాల్లో ఆందోళనలు చేసినా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకుండా ఆ షాపుకు లైసెన్స్ ఇవ్వడమే కాకుండా నిరాటంకంగా వ్యాపారం నిర్వహించుకోమని చెప్పడంతో ప్రస్తుతం ఈ ప్రాంతంలో మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు గంజాయి, మద్యం విక్రయాలను నియంత్రించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

పంచాయతీ ఛాంపియన్స్‌తో ఎంపి శివనాథ్

ప్రజాశక్తి-విజయవాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు గ్రామస్థాయిలో ప్రతి ఇంటికి చేరుకోవాలి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆశయం వికసిత్ భారత్ సాధించాలంటే గ్రామాభివృద్ధితోనే సాధ్యం. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమైన ప్రతి కుటుంబంలో ఒక ఎంటర్ ప్రెన్యూర్ వుండేవిధంగా పంచాయతీ ఛాంపియన్స్ సమగ్ర గ్రామాభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలని ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. వికసిత్ పంచాయిత్ లో భాగంగా ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఎన్ఐఆర్‌డి సహకారంతో తన సొంత నిధులతో కేశినేని ఫౌండేషన్ ద్వారా సమగ్ర గ్రామాభివృద్ధికి కావాల్సిన శిక్షణ పూర్తి చేసిన 33 మంది పంచాయతీ ఛాంపియన్స్‌తో హైదరాబాద్ ఎన్ఐఆర్‌డిపిఆర్‌లో ఆదివారం సమావేశం అయ్యారు. ఈ నెల 10 నుంచి 16 వరకు హైదరాబాద్ ఎన్ఐఆర్‌డిలో సమగ్ర గ్రామాభివృద్ధికి శిక్షణ తీసుకుని పంచాయతీ ఛాంపియన్స్ గా తయారైన 33 యువకులకి ఎంపి కేశినేని శివనాథ్, ఎన్ఐఆర్‌డిపిఆర్ డైరెక్టర్ జనరల్ జి.నరేంద్రకుమార్ ఐఎఎస్ సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం వారికి ఎంపి కేశినేని శివనాథ్ దిశానిర్దేశం చేశారు. యువతకు ఉపాధి మార్గం కల్పించే కేంద్ర పథకాలపై గ్రామంలోని నిరుద్యోగ యువతకు అవగాహన పెంచాలన్నారు. వారందర్నీ చిన్న చిన్న పెట్టుబడులతో ఎక్కువ లాభాలు అర్జించే కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే విధంగా తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, అభివద్ధిని ఛాంపియన్లపైనే ప్రతి ఇంటికి చేర్చే బాధ్యత ఉందన్నారు.

ప్రజావాణి వినిపించేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలే

కృష్ణాజిల్లాలో 63 వేల 190 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో 78,238 మంది ఓటర్లు ఉన్నారు. ఆరు ప్రాంతాల్లో మొత్తం 416 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. జిల్లా కేంద్రమైన బాపట్లలో మొత్తం ఏడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మున్సిపల్ హైస్కూల్లో రెండు పోలింగ్ కేంద్రాలు బాపట్ల ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాలలో రెండు పోలింగ్ కేంద్రాల్లో పట్ట భద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మున్సిపల్ హైస్కూల్ 413 నెంబరు పోలింగ్ కేంద్రంలో541 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేశారు. అదేవిధంగా 413/ఎం పోలింగ్ కేంద్రంలో 541 నుంచి 1041 వరకు 5 వందల మంది, 414 పోలింగ్ కేంద్రంలో 960 మంది, 415 పోలింగ్ కేంద్రంలో 560 మంది 415/ఎ పోలింగ్ కేంద్రంలో 586 మంది, 416 పోలింగ్ కేంద్రంలో 650 మంది, 416/ఎ పోలింగ్ కేంద్రంలో 570 మంది పట్టభద్రులైన ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అధికారులు ఏర్పాటు చేశారు. మొత్తంగా బాపట్లలో ఏడు పోలింగ్ కేంద్రాల్లో 4,375 మంది పట్టభద్రులైన ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. తెలుగుదేశం కూటమి అభ్యర్థిగా తెనాలికి చెందిన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పోటీ చేస్తున్నారు. రాష్ట్ర మంత్రిగా పనిచేసి మూడుసార్లు శాసనసభ్యులుగా గెలిచిన ఆలపాటి 2024 ఎన్నికల్లో తెలుగుదేశం నుంచి పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయారు.కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా అప్పట్లో తెనాలి స్థానాన్ని జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు కేటాయించటంతో ఆలపాటికి అవకాశం లేకుండా పోయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన అవకాశంతో ఎమ్మెల్సీ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. శాసనమండలిలో బలమైన వాణి వినిపిస్తూ ప్రజాతంత్ర వాదులతో కలిసిపోతూ తన ఇమేజ్ ను సొంతం చేసుకున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్. లక్ష్మణరావు బలమైన ప్రచారంతో ముందుకు దూసుకెళ్తున్నారు. మూడుసార్లు శాసనమండలిలో తనకున్న అపార అనుభవాన్ని ప్రచారం చేసుకుంటూ, మరోసారి అవకాశం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. శాసనమండలిలో అనేక సమస్యలను ప్రస్తావించటం ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాడి సాధించుకోవడంలో లక్ష్మణరావు క్రియాశీలక పాత్ర పోషిస్తూ వస్తున్నారనే పేరు గడించారు. శాసనమండలిలో అపార అనుభవం గల లక్ష్మణరావు గెలుపునకు జిల్లాలో సిపిఎం , సిఐటియు, యుటిఎఫ్ నాయకత్వం విశేషంగా కృషి చేస్తోంది. శాసనమండలిలో ప్రజావాణిని వినిపించ గల సత్తా గల వ్యక్తి లక్ష్మణరావు ఈ ఎన్నికల్లో తిరిగి ఆయన విజయం తధ్యమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని ప్రచారం



చల్లపల్లి మండలంలో...



ఉంగుటూరు మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఉంగుటూరు : నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని పోరాటం చేస్తున్న కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని సిఐటియు జిల్లా నాయకులు పిల్లి మహేష్ కోరారు. ఆదివారం వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండలంలోని తేలప్రోలు గ్రామంలో పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు గెలుపుకి సహకరించాలని కోరుతూ ఇంటింటికీ వెళ్ళి ఓటర్లను కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఈ నెల 27న జరుగుతున్న శాసన మండలి ఎన్నికల్లో కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి అభ్యర్థిగా వివిధ ప్రజాసంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు గెలుపు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, నిరుద్యోగ సమస్యల పరిష్కార గొంతుక అని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అజ్మీరా వెంకటేశ్వరరావు, రైతు సంఘం మండల నాయకులు మాగంటి సాంబశివరావు, భీమవరపు సుబ్బారెడ్డి, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-చల్లపల్లి : కెఎస్ లక్ష్మణ్ గెలిపించాలని కోరుతూ ఆదివారం ప్రజా సంఘాల నేతలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ నిరుద్యోగుల కోసం అవగాహనా సమావేశాలు ఏర్పాటు చేసి, వేల మందికి ఉచితంగా స్టడీ మెటీరియల్ ను కె ఎస్ లక్ష్మణరావు పంపిణీ చేశారని వివరించారు. నిత్యం పేద ప్రజల కోసం పోరాటం చేసే ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ ఖదీముల్లా, రైతు సంఘం నాయకులు బళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆగని ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి-చల్లపల్లి : ఎన్ని ప్రభుత్వాలు మారినా చట్టాలు ఎన్ని చేసినా మాకేంటంటూ ఇసుక అక్రమ దారులుపెట్రేగిపోతున్నారు . అక్రమ ఇసుక రవాణా దారులపై సంబంధిత అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని రెవెన్యూ,పోలీస్ శాఖ అధికారులపై ప్రజలు మండిపడుతున్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు కాగితాలకే పరిమితం అయ్యాయని పాలకులపై విమర్శలు గుప్పిస్తున్నారు. మండల పరిధిలోని కృష్ణా నదీ పరివాహక ప్రాంతాలలో ఇసుక రీచులు లేవని రెవెన్యూ శాఖ అధికారులు ప్రకటించిన అక్రమ రవాణా ఇసుక కొనసాగడంపై కొందరి కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్యమని ప్రజల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. వెలివోలు రేవులో అక్రమ ఇసుక దందా,నదీ గర్భం అక్రమ దారుల అడ్డాగా మారినా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెలువోలు నది నుండి రాత్రి పగలు తేడా లేకుండా ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు ద్వారా ఇసుక అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల నడకుదురు రేవు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని వారిపై కేసులు పెట్టి అధికారులు చేతులు దులుపుకున్నారు. కృష్ణ నది నడిబొడ్డున మెట్ట పంటపొలాలలో పంటలు పండిస్తున్న రైతులు నది నుండి ఇసుక అక్రమ రవాణా చేయటం వల్ల భూగర్భ జలాలు అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-నందివాడ : మండలంలోని రౌడీషీటర్లకు నందివాడ ఎస్సై కె.శ్రీనివాసు కౌన్సెలింగ్ ఆదివారం నిర్వహించారు. పాత నేరస్థులు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చెడు అలవాట్లకు స్వస్తి చెప్పి సత్ప్రవర్తనతో మెలగాలని, ఎవరైనా దానికి భిన్నంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ శాఖ ఆదేశాలు, సూచనలను పెడచెవిన పెట్టి ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. అనుమానితుల కదలికలను పోలీస్ శాఖ గమనిస్తూ ప్రత్యేక నిఘా ఉంచుతోందని, జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు.



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

వీరమ్మ తిరునాళ్లకు పోటెత్తిన యాత్రికులు

- పోలీసుల పటిష్ట బందోబస్తు



తిరునాళ్లలో యాత్రికుల సందడి

ప్రజాశక్తి-ఉయ్యూరు : వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. తిరునాళ్లలో చివరి ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు లక్షకుపైగా భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జాము 4 గంటలనుంచి అర్ధరాత్రివరకు ఆలయం వద్ద భక్తుల రద్దీ కొనసాగ గా పెద్దయెత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం, పట్టణ రహదారులు కిక్కిరిసి జనసంద్రంలా కన్పించాయి. ఉమ్మడి జిల్లా, పొరుగు జిల్లాలతో పాటు రెండు తె లుగు రాష్ట్రాలనుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో పాలపొంగళ్లు తయారుచేసి. పసుపు కుంకుమ, చీర సారె అమ్మవారికి సమర్పించారు.

పటిష్ట బందో బస్తు: ఆదివారం సెలవు రోజు కావడంతో తిరునాళ్లకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరాగా పోలీసులు పెద్దయెత్తున బందోబస్తు ఏర్పాటుచేశారు. ఆలయ ప్రాంగణంతో పాటు ప లుచోట్ల సిబ్బందితో బందో బస్తు నిర్వహించారు.

ప్రసాదం పంపిణీ : వీరమ్మతిరునాళ్లలో భక్తులకు పద్మశాలీయ సేవా, సంక్షేమ సంఘం ఉయ్యూరు ఆధ్వ ర్యంలో ఆదివారం పది వేల మంది భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కోరిన కోర్కెలు తీర్చేకల్పవల్లి వీరమ్మతల్లిని తిరునాళ్లలో దర్శించి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎంవిఎస్ మూర్తి, తుమ్మలచర్ల శ్రీధర్, కోశాధికారి గొట్టుముక్కల సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఉపాధ్యక్షుడు ఎన్ వెంకటప్ర సాద్, సుబ్బారాయుడు, దిలీప్, శ్రీకాంత్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొని సేవ లందించారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి



ప్రజాశక్తి-తోట్లవల్లూరు : కుటుంబ కలహాల కారణంగా ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బొడ్డపాడు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై అవినాష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శ్రీకాకుళపు అంజిబాబు(45) ఇంటిలో ఉరి వేసుకుని మృతి చెందాడని భార్యాభర్తల గొడవల కారణంగా, ఇద్దరి మధ్య మనస్పర్ధలు రావడం వల్ల ఉరివేసుకోవడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల ఉన్నారు. భార్య వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన సురేష్

ప్రజాశక్తి-తోట్ల వల్లూరు : మండలంలోని తోట్లవల్లూరు గ్రామ దళితవాడకు చెందిన చీకుర్తి సురేష్ (42) ఎడ్ల బండిని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీ సుల తెలిపిన వివరాల ప్రకారం చీకుర్తి సురేష్ ఆర్టీసీ కండక్టర్ గా పని చేస్తున్నాడు. ఆదివారం ఉయ్యూరు డిపోలో డ్యూటీ దిగి తన ద్విచక్ర వాహనం స్కూటీ పై ఇంటికి వెళ తున్నాడు. యాకుమూరు సమీపంలో ఉయ్యూరు నుండి తోట్లవల్లూరు వెళుతున్న ఎడ్ల బండిని చీకట్లో కనిపించక వెనక నుండి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎడ్ల బండికి రేడియం స్టిక్కర్ లేకపోవడం వలన ఈ ప్రమాదం జరిగిందని,ఎడ్లబండ్లకు కనీసం రేడియం స్టిక్కర్లు లేకుండా ఎంతో కాలంగా ఇసుక,చెరుకు రవాణాకు ఎడ్ల బండ్లు తిరుగుతున్నాయి. ఈ ఎడ్లబండ్ల ప్రమాదాల్లో అనేక మంది మతి చెందిన ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారని విమర్శలు వస్తున్నాయి. సురేష్ భార్య మహారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అవినాష్ తెలిపారు. పమిడిముక్కల సీఐ వై.చిట్టి బాబు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి,వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

మూడో రోజుకు దీక్షలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : కేంద్ర కార్యాలయ సర్కులర్ కు వ్యతిరేకంగా ఉయ్యూరు డిపోలో జరిగిన చార్జ్ కౌన్సిలిం గ్ ప్రక్రియ రద్దు చేయకపోతే ఉద్యమాన్ని మరింత ఉధతం చేస్తామని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్ రాజేశ్ కుమా ర్ హెచ్చరించారు. సర్కులర్కు భిన్నంగా, ఏకపక్షంగా నిర్వహించిన చార్జ్ కౌన్సిలింగ్ విధానానికి వ్యతిరేకంగా స్థానిక డిపో అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు చేపట్టిన రిలేదీక్ష ఆదివారం మూడోరోజు కొనసాగింది. దీక్షను ప్రారంభించిన రాజేష్ కుమార్ మాట్లాడుతూ డిపో ఉద్యోగులు కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో నిరసన తెలిపి, మూడురోజులుగా రిలేదీక్ష చేస్తున్నా అధికారులు పట్టించుకోపోవడం బాధాకరమన్నారు. ఎల్ఎస్ రావు, జీఎస్ రావు దీక్షలో పాల్గొన్నగా ఎన్టీఆర్ జిల్లా సెక్రట రీ రామకృష్ణ, కోశాధికారి అజయ్, జాయింట్ సెక్రటరీ సురేశ్ కుమార్ దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. డిపో కార్యదర్శి పి మురళీకృష్ణ, జిల్లా నాయకులు, మచిలీపట్నం డిపో నాయకులు హాజరై ఉద్యమానికి మద్దతు పలికారు,



10కె, 6కె రన్ పోటీలు ప్రారంభం



రన్ రేస్ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

ప్రజాశక్తి - గుడివాడ : క్రీడా రంగంలో యువతకు రాష్ట్రంలో ఉజ్వల భవిష్యత్ ఉందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్టిఆర్ స్టేడియం వద్ద నుండి స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో పర్వతనేని జగన్మోహన్‌రావు 20వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం నిర్వహించిన పురుషుల 10కె రన్, స్త్రీల 6కె రన్ పోటీలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 39 సంవత్సరాలుగా క్రీడల అభివద్ధికి ఎన్టీఆర్ స్టేడియం ద్వారా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. క్రీడారంగంలో పట్టుదలతో పాల్గొని ఎంతమంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడమే కాకా ప్రపంచంలోనే ఉన్నత స్థాయిలో నిలిచారన్నారు. ఎన్టిఆర్ స్టేడియం క్రీడాకారులకు వరమని, ఎన్టిఆర్ ముందస్తు చూపుతో స్టేడియాన్ని నిర్మించారన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు, పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, కమిటీ సభ్యులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మడక మనవడికి ప్రత్యేక బహుమతి : స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 10కె రన్ పోటీలలో నేషనల్ రిఫరీ మడక ప్రసాద్ మనవుడు మడక సత్యఆదిత్యప్రసాద్ 4 కిలోమీటర్ల పరుగు పందెంలో పూర్తిచేశారు. ఈ టోర్నమెంట్ మొత్తంలో (4సం॥లు) వయస్సులో అతితక్కువ వయస్సు కలిగిన వాడిగా 4కె పూర్తి చేశాడు. ఈ సందర్భంగా ఆదిత్యప్రసాద్‌కు గౌతమ్ పాఠశాల అధినేత కె.అవినాష్ చేతుల మీదగా ప్రశంసా పత్రం నగదు బహుమతి అందజేశారు.



ఘంటసాల వర్ధంతి

విజయవాడ : ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో అమర గాయకుడు ఘంటసాల వర్ధంతి నిర్వహించారు. గుడివాడ నుండి విచ్చేసిన విశ్రాంత గ్రంథ పాలకులు ఆవిర్నేని వెంకటేశ్వరరావు పాల్గొని ఘంటసాల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఘంటసాల 1922 డిసెంబర్ 4న గుడివాడ సమీపంలోని చౌటపల్లి గ్రామంలో ఘంటసాల సూర్యనారాయణ, రత్నమ్మ అనే బ్రాహ్మణ దంపతులకు జన్మించారన్నారు. తండ్రి ఆశయం నెరవేర్చడానికి ఘంటసాల సంగీత గురుకులాలలో చేరినా, ఆ కట్టుబాట్లు తట్టుకోలేక వెనక్కు వచ్చేశాడు. ఒకసారి సమీప గ్రామంలో జరిగిన సంగీత కచేరీలో విద్వాంసులతో పోటీపడి ఓడిపోయి నవ్వులపాలయ్యారన్నారు. అప్పటినుండి ఆయనలో పట్టుదల పెరిగిందని, తనకు తెలిసిన కొందరు సంగీత విద్వాంసుల ఇళ్ళల్లో పనిచేస్తూ సంగీతం అభ్యసించడానికి నిశ్చయించుకున్నారన్నారు. ఈయన తెలుగు సినీ రంగంలో ఎంతో ఖ్యాతి గడించారని ఆయన ఆలపించిన ఎన్నో మధుర పాటలు నేటికీ అనేక మంది ఇళ్ళల్లో మోగుతూనే ఉన్నాయని, ఘంటసాల ఆలపించిన భగవద్గీత తెలుగు నాట అత్యంత జనాదరణ పొందిందని పేర్కొన్నారు. 1974 ఫిబ్రవరి 11న అనారోగ్యంతో ఆసుపత్రిలో కన్నుమూశారని తెలిపారు. అనంతరం కొన్ని ఘంటసాల పాటల ఆలపించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ అధికారిని కె.రమాదేవి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వైద్యానికి సాయం

ప్రజాశక్తి - నందిగామ : ఊబకాయంతో 154 కేజీల బరువుతో దిక్కుతోచని స్థితిలో ఉన్న నందిగామకు చెందిన మైలవరపు అరవింద్ (45)కు నందిగామ ఆర్యవైశ్యులు రూ.1,27,386-00 ఆదివారం అందజేశారు. మైలవరపు అరవింద్‌కు శరీరంలో ఉన్న హార్మోన్స్ సమతుల్యత లేని కారణంగా శరీరాకృతి విపరీతంగా పెరిగింది. రెండు కాళ్ళల్లో చెడు ద్రవం చేరి నడవలేని స్థితిలో రెండు కాళ్ళు బాగా వాసిపోయి చూడటానికి కూడా భయకంపితులను చేసే అరుదైన అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్న మైలవరపు అరవింద్‌కు అత్యున్నత వైద్య చికిత్స చేయవలసిన అవసరం ఉంది. నందిగామ ఆర్యవైశ్య సంఘం నాయకులు పారేపల్లి సాయిబాబు బృందాన్ని అర్థించాడు. ఆర్యవైశ్య ప్రముఖుల సమక్షంలో అరవింద్ ఆయన భార్య, కుటుంబ సభ్యులకు సాయం అందజేశారు.

దుర్గమ్మ దర్శనానికి యాత్రికులు



ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆదివారం సందర్భంగా ఉదయం నుండి యాత్రికులు దుర్గమ్మను దర్శించు కున్నారు. హోమాలు, పలు కార్య క్రమాల్లో యాత్రికులు పాల్గొన్నారు. రద్దీ దృష్ట్యా దేవస్థానం వారు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

అందని కందిపప్పు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఈ నెల రేషన్ డిపోలో కందిపప్పు లబ్ధారులకు అందించలేదని కార్పొరేటర్ బోయి సత్యబాబు వద్ద పలువురు ఆవేదన వెలిబుచ్చారు. గొల్లపాలెం గట్టు కొండ ప్రాంతంలో ఆదివారం సత్యబాబు పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలు రేషన్ డిపోలో నాణ్యమైన బియ్యం అందడం లేదని కందిపప్పు నాణ్యతగా లేక ఉడకడం లేదని ఈనెల కందిపప్పు కూడా ఇవ్వలేదని తెలిపారు. పెళ్లయిన వారికి పిల్లలున్నవారికి రేషన్ కార్డులో పేర్లు నమోదు కావడం లేదని ప్రభుత్వం వెంటనే రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభించాలని కోరారు. అడ్డూ ఆపు లేకుండా పెరుగుతున్న ధరలు అరికట్టకుండా గాలికి వదిలేసిన ప్రభుత్వం రేషన్ డిపోలో ఇవ్వాల్సిన నాణ్యమైన కందిపప్పు ఇవ్వకుండా మోసగించడం సరికాదన్నారు. పామాయిల్ వెల్లుల్లి ఉల్లి చింతపండు వంటి నిత్యావసర వస్తువులు కూడా రేషన్ డిపోలో చౌకదారులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుని ఏదో మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడాలని కోరారు. కొన్ని రేషన్ వెహికల్స్ వద్ద కార్డుదారులకు రేషన్ ఇవ్వకుండా తిప్పుతున్నారని ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా పోరాటాలు, ఉద్యమాల్ని చేపడతామని ఈ సందర్భంగా బి.సత్తిబాబు తెలిపారు. ఈ పర్యటనలో రాము సతీష్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సత్యబాబు

యుటిఎఫ్ మినీ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - విస్సన్నపేట : యుటిఎఫ్ విస్సన్నపేట శాఖ రూపొందించిన మినీడైరీ మాజీ జిల్లా గౌరవ అధ్యక్షులు డి.శ్రీనివాసరెడ్డిచే ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యా యులకు సేవ చేయటంలో సమస్యల పరిష్కారంలో ముందుండే సంఘం యుటిఎఫ్ అని అన్నారు. జిల్లా కార్యదర్శి బిసిహెచ్‌వి. సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ డైరీలోని సమాచారం అందరు ఉపాధ్యాయులకు ఉపయెగకరంగా ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏలూరు జిల్లా కార్యదర్శి పి.వీరకోటి హాజరై యుటిఎఫ్‌ను మండలంలో మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు సి హెచ్ చంటి బాబు,ఎ మురళీకష్ణ, కే రంగ, కే శ్రీనివాసరావు,వి రవి, డి రాంబాబు, ఈ నాగేశ్వరరావు,వి వెంకటేశ్వరరావు మరియు యూటీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



అపోలో ఆధ్వర్యాన ఉచిత రక్త పరీక్షలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఆదివారం ఉదయం భవానీపురం స్వాతి రోడ్డులో అటల్ బిహారి వాజ్‌పాయ్ ఉద్యానవనంలో మార్నింగ్ వాక్‌కి వచ్చిన వందమంది పైగా వాకర్స్‌కి అపోలో డయాగ్నొస్టిక్స్ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు చేసినట్లు మేనేజర్ సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ముందుగా బీపీ పరీక్షించి అనంతరం వాకర్స్ నుండి బ్లడ్ శాంపిల్స్ సేకరించి షుగర్, కొలెస్ట్రాల్, థైరాయిడ్ మొదలగు పరీక్షల నిర్వహించి ఫలితాలను (రిపోర్టులు)వారికి అందజేసి వైద్య, ఆరోగ్యపరమైన సూచనలు ఇచ్చారు. ఇటువంటి సేవలు అందించిన అపోలో డయాగ్నోస్టిక్స్ మేనేజర్ సతీష్, ల్యాబ్ టెక్నీషియన్ ఎస్.కె.కమరుద్దీన్, ఎస్.కె సుభాని, సమీర్‌లకు వాకర్స్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపారు.



రక్తపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

డాన్‌బాస్కో విద్యార్థినులకు పతకాలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి క్యాడెట్ (అండర్ -14) తైక్వాండో పోటీల్లో గుణదల డాన్‌బాస్కో సూల్ విద్యార్థినులు అత్యధిక పతకాలు సాధించినట్లు ఫాదర్ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ స్కూల్‌కఁ చెందిన కలతోటి దామిఁ, మురాల రిత్సిక తొమ్మిది పతకాలు సాధించినట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తరఫున వివిధ విభాగాల్లో ప్రాతిఁధ్యం వహించిన దామిని 3 బంగారు, 1 వెండి, 1 కాంస్యం, రిత్సిక 2 బంగారు, 1 వెండి, 1కాంస్య పతకాలు సాధించారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని, అంతర్జాతీయ పోటీల్లో కూడా ప్రాతిఁధ్యం వహించాలఁ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్ మలిశెట్టి అంకమ్మరావు, స్కూల్ టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.



క్రీకాకారులను అభిసందిస్తున్న దృశ్యం

నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గౌరవరం గ్రామంలో మండల పార్టీ అధ్యక్షులు బూడిద నరసింహారావు అధ్యక్షతన నూతనంగా ఎన్నుకోబడ్డ గ్రామ పార్టీ అధ్యక్షులు ఆదూరి కిషోర్, గ్రామ పాలక సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం, కార్యకర్తల ఆత్మీయ సమావేశం శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి నియోజకవర్గ ఇన్చార్జి వైసిపి ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లాగా పని చేయాలన్నారు, మోసపూరిత హామీలకు కేరాఫ్ అడ్రస్ కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవి, రాష్ట్ర ఎంపీపీ సంఘాల అధ్యక్షులు మార్కపుడి గాంధీ, జిల్లా అధికార ప్రతినిధి చింతగుంట్ల వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి వేముల మల్లేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి పెంటయ్య పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామ శివారులో 9(2) మామిడి తోటలో కోడిపందేలు ఆడుతున్నారని ఎస్ఐ జి.రామకృష్ణకి వచ్చిన సమాచారం ప్రకారం ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 11 మంది కోడిపందేల జూదరులను, 8 ద్విచక్ర వాహనాలు, రెండు కోడిపుంజులు, నగదు రూ.6510లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి రామకష్ణ తెలిపారు.

నేడు లైఫ్ లైన్ డయాగ్నోస్టిక్ ప్రారంభం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నెహ్రూనగర్‌లో సోమవారం లైఫ్ లైన్ డయాగ్నొస్టిక్, స్పెషాలిటీ క్లినిక్‌ను గ్రాండ్‌గా ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు మన్నె సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా టిడిపి అధ్యక్షుడు నెట్టెం రఘురాం, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, రాష్ట్ర విప్, నందిగామ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతాయ్య), టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి వెంకట రామకష్ణ ప్రసాద్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు.



కృష్ణవేణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నటి కృష్ణవేణికి నివాళి

ప్రజాశక్తి - నందిగామ : సినీనటి, తొలితరం తెలుగు సినిమా నిర్మాత కృష్ణవేణికి నందిగామలో ఆల్ ఇండియా ఎన్టీఆర్ అభిమాన సంఘాల ఉపాధ్యక్షుడు వడ్డెల్లి సాంబశివరావు, నాయకులు ఆదివారం నివాళులర్పించారు. ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు వడ్డెల్లి సాంబశివరావు ఆదివారం నందిగామలో కృష్ణ వేణి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ రఘుపతి వెంకయ్య నాయుడు పురస్కార గ్రహీత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నటరత్న డాక్టర్ పద్మశ్రీ నందమూరి తారక రామారావును 1949 సంవత్సరంలో మొట్టమొదటి సారీ, మనదేశం, చిత్రం ద్వారా అవకాశాన్ని కల్పించిన ఘనత కృష్ణ వేణికే దక్కిందన్నారు. ఈ సంతాప సభలో అన్న ఎన్టీఆర్ అభిమానులు మహంకాళి కోటేశ్వరరావు, కర్రీ వెంకటేశ్వర రావు, ఉద్దండు , సాహెబ్, మౌలాలి సాహెబ్, చందూరి బ్రహ్మం, ఎలక్ట్రీషన్ అధ్యక్షుడు ఆనంద్, కుద్దూస్, సైదా, కందుల వెంకటేశ్వరరావు, పూజారి చిన్న, వీరమాచినేని బసవయ్య, పలువురు



నత్తనడకన కొత్త టెర్మినల్ పనులు

- ఇప్పటివరకు 65 శాతం మాత్రమే పూర్తి
- కేంద్ర మంత్రి చెప్పినా సాగని పనులు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం విమానాశ్రయంలోని ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ ను పనులు నత్తనడకన సాగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే కారణమని అంటున్నారు. కొత్త టెర్మినల్ అందుబాటులో రావడానికి ఇంకో ఏడాది పడుతుందని భావిస్తున్నారు. వచ్చే జూన్ నాటికి పూర్తి చేయాలని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్నాయుడు ఇప్పటికి మూడుసార్లు సమీక్షలు నిర్వహించి మరీ గుత్తేదారు సంస్థకు గట్టిగా చెప్పినా ఫలితం కనిపించడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు విమానాశ్రయాలపై సమీక్షల్లో ఇప్పటికి రెండుసార్లు గన్నవరంలోని ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ను ఆరు నెలల్లోగా పూర్తి చేయాలంటూ ప్రత్యేకంగా చెప్పారు. మచిలీపట్నం, విజయవాడ ఎంపీలు వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్ (చిన్ని) అనేకసార్లు విమానాశ్రయానికి వచ్చి పనులను సమీక్షించారు. అభివృద్ధి కమిటీ సమావేశాల్లోనూ పనుల జాప్యంపై ఎంపీలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వీరంతా గట్టిగా చెప్పినా, అసహనం, ఆగ్రహం వ్యక్తం చేసినా.. గుత్తేదారు సంస్థ తీరు మాత్రం మారలేదు. టెర్మినల్ పనులు ఎప్పుడు చూసినా ఆగిపోయినట్లే కనిపిస్తున్నాయి.

ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవనం జూన్ లోగా అందుబాటులోకి రావాలంటే.. మూడు షిఫ్టుల్లో పనులు చేపట్టాలి. అయితే ఏ సమయంలో చూసినా ఓ వంద మంది కార్మికులు కూడా కనిపించడం లేదు. ఇలాంటి స్థితిలో జూన్ లోగా నిర్మాణం ఎలా పూర్తి చేస్తారు? కేవలం కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి, ఎంపీలు వచ్చిన సమయంలో గుత్తేదారు సంస్థ ప్రతినిధులు హడావుడి చేయడం, పనులు వేగంగా చేయిస్తున్నట్లు చెప్పుకోవడం తప్ప ఎలాంటి పురోగతి కనిపించడంలేదు.

విమానాశ్రయ అధికారులకు పట్టదా? : నిత్యం విమానాశ్రయంలోనే ఉండే అధికారులు ఏం చేస్తున్నట్లు?అని ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. అమరావతి రాజధానికి గన్నవరం విమానాశ్రయం చాలా కీలకమని, ముఖ్యమంత్రి ప్రత్యేకంగా దీనిపై దష్టి పెట్టారని, కేంద్ర మంత్రి స్వయంగా వచ్చి మరీ చెప్పినా.. అధికారులు ఎందుకు రోజువారీగా పర్యవేక్షించడం లేదనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. విమానాశ్రయ డైరెక్టర్ ఈ పనుల పర్యవేక్షణపై ప్రత్యేక దష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఆయన పెద్దగా పట్టించుకోవడం లేదని విమర్శ ఉంది. గత రెండేళ్లలో పనులు వేగంగా జరగకపోయినా అధికారులకు ఏమాత్రం పట్టడం లేదనే విమర్శ ఉంది.

ఇప్పటివరకూ జరిగిన, జరగాల్సిన పనులు : టెర్మినల్ ప్రధాన భవనంలో 70 శాతం సిమెంట్ పని పూర్తయింది. మరో 30 శాతం జరగాల్సి ఉంది. బేస్మెంట్, ఒకటి, రెండో అంతస్తులకు సంబంధించిన పిల్లర్లు, శ్లాబులు పూర్తయ్యాయి.

గ్లాస్ అండ్ స్టీల్ స్ట్రక్చర్: సిమెంట్ పని మొత్తం పూర్తయ్యాక.. దానిపై స్టీల్ అండ్ గ్లాస్తో వెలుపలి భాగం మొత్తం నిర్మించాలి. ఈ పనులు ఇంకా ఆరంభం కాలేదు. పలు అనుసంధానం చేసే రహదారుల నిర్మాణం చేయాల్సి ఉంది. పార్కింగ్ ప్రదేశాలు, టెర్మినల్ ఎదుట ఆహ్లాదకరంగా ఉండేలా ఫౌంటెన్లు, పార్కుల పనులు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి.

ఇమిగ్రేషన్, కస్టమ్స్ విభాగాలు : విమానాశ్రయంలోని తాత్కాలిక అంతర్జాతీయ టెర్మినల్లో ఇప్పటికే కస్టమ్స్, ఇమిగ్రేషన్ విభాగాల సేవలు ప్రారంభమయ్యాయి. కొత్త టెర్మినల్ పూర్తయితే ఇక్కడికి వచ్చేస్తాయి. టెర్మినల్ కు వాహనాలు చేరుకునే పైవంతెన 60 శాతం పూర్తయింది. ప్రయాణికులను తీసుకొచ్చి దించేసి.. వెళ్లిపోయే వాహనాల కోసం టెర్మినల్ కు అనుసంధానంగా నిర్మిస్తున్న ఈ వంతెన పిల్లర్లపై.. డెక్ శ్లాబును మధ్యలో కొంత భాగం, రెండు వైపులా చివరన ఇంకా అమర్చాలి. వంతెనపై రహదారిని వేయాలి. టెర్మినల్ కు వెనుక వైపున మూడు వంతెనలు, ఆరు ఏరో బ్రిడ్జ్ ఉంటాయి. నేరుగా ప్రయాణికులు ఈ ఏరో బ్రిడ్జ్ పైనుంచి టెర్మినల్లోకి వచ్చేస్తారు. ప్రస్తుతం మూడు వంతెనల నిర్మాణం 70శాతం మేర పూర్తైంది. అసలైనవి ఆరంభమే కాలేదని అంటున్నారు. టెర్మినల్ భవన నిర్మాణం పూర్తయ్యాక.. లోపల తుదిదశ పనులకే నెలల సమయం పడుతుంది. 24 చెకిఇన్ కౌంటర్లు, 14 ఇమిగ్రేషన్, 4 కస్టమ్స్ కౌంటర్లు, డిపార్చర్, అరైవల్ బ్లాకుల్లో బ్యాగేజీ కన్వేయర్లు, అంతర్జాతీయ స్థాయి బ్యాగేజీ హ్యాండ్లింగ్ వ్యవస్థ, సెంట్రల్ ఏసీ, 24 గంటలూ సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, విమానాశ్రయ సిబ్బంది, ఎయిర్లైన్స్ సంస్థల కార్యాలయాలు, బుకింగ్ కౌంటర్లు, లాంజ్లు.. ఇవన్నీ ఏర్పాటు చేయడానికి కనీసం ఆరు నెలలు పడుతుంది. కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో కార్మికులను పెట్టి పనులు వేగం చేయిస్తే ఆగస్టు నాటికైనా ఓ కొలిక్కి వస్తాయనంటున్నారు.



ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణా జిల్లా నూతన ఎం. జాన్సన్, వి.దీపక్ లు ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి కష్ణా జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జిల్లా ఖజానా కార్యాలయం మచిలీపట్నంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో సహ అధ్యక్షులుగా డి. శ్రీనివాసరావు, హరీష్, ఉపాధ్యక్షులుగా బి. నాగేంద్రం, సురేష్, రమాదేవి, సుధాకర్. సహాయ కార్యదర్శులుగా గోపాల్ సింగ్, రాధికా, వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఏపి ఎన్ జి ఓస్ అసోసియేషన్ ఈస్ట్ కష్ణా అధ్యక్షులు ఆకూరి శ్రీనివాస్‌రావు ప్రకటించారు. అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్ గా, నెల్లూరు జిల్లా ట్రెజరి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పి. కిరణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమణారెడ్డి రాష్ట్ర పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు జాన్సన్ మాట్లాడుతూ ఖజానా శాఖలో చాలా సమస్యలు ఉన్నాయని, వాటిని అధికార్లదష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి త్వరితగతిన కషి చేస్తామన్నారు.

మెకానిక్‌ల సంక్షేమానికి కృషి : మంత్రి కొల్లు



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : నిరంతరం కష్టపడే మెకానిక్ ల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు టూ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ 13వ వార్షికోత్సవం ఆదివారం మచిలీపట్నం అన్నం వీర రాఘవయ్య సత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ కార్మికుల కష్టాలు తనకి వ్యక్తిగతంగా తెలుసని మెకానిక్ ల అందరికీ తన వంతుగా ఒక సంవత్సరం ఉచితంగా ఎల్ఐసి ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తానని భరోసా ఇచ్చారు. అలాగే మచిలీపట్నంలో అర్హులైన మెకానికులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ పథకాలను అందజేస్తామన్నారు. మెకానికుల సంఘ భవనం కోసం 100 గజాల స్థలాన్ని ప్రభుత్వపరంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు కొనకళ్ళ బుల్లయ్య, మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకష్ణ, సంఘం లీగల్ అడ్వైజర్ ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, సంఘం అధ్యక్షుడు కొల్లా వెంకట సుబ్బారావు, మచిలీపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ మోటమర్రి బాబా ప్రసాద్ పాల్గొన్నారు.

18న కిసాన్ మేళాను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి-ఘంటసాల : ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధి లోని వ్యవసాయ పరిశోధన స్థానం, కషి విజ్ఞాన కేంద్రం ఘంటశాల వారు సంయుక్తంగా ఈనెల 18వ తేదీన వ్యవసాయ పరిశోధన స్థానం ఘంటశాల ప్రాంగణంలో నిర్వహించనున్న కిసాన్ మేళాను రైతులు అందరూ ఉపయోగించుకోవాలని శాస్త్రవేత్తలు కోరారు. కిసాన్ మేళాలో వ్యవసాయ, ఉద్యాన మరియు వ్యవసాయ అనుబంధ రంగాల సాంకేతిక ప్రదర్శనలు రైతులకు ఉపయోగపడేలా ఏర్పాటు చేయడం జరుగుతుందని తదుపరి వివిధ విభాగాల ప్రధాన శాస్త్రవేత్తలు అందరూ పాల్గొని రైతులకు అపారాల సాగులో గల వివిధ సమస్యలు, సందేహాలకు సాంకేతికపరమైన సూచనలను తెలియజేస్తారన్నారు. ఈ కిసాన్ మేళా ముఖ్య అంశము వరి మాగాణుల్లో అపరాల సాగు - సవాళ్లు మరియు భవిష్యత్తు కార్యాచరణతో పాటు భవిష్యత్తులో చేపట్టవలసిన పరిశోధనలు మరియు విస్తరణ అంశాలపై పై చర్చా గోష్ఠి కార్యక్రమము చేపడతారన్నారు.



క్యాబేజిని పరిశీలిస్తున్న విజయ్ సునీత

రైతుబజార్ల ద్వారా క్యాబేజీ విక్రయాలు : కమిషనర్

ప్రజాశక్తి-ఉయ్యూరు : క్యాబేజీ పంటకు ధర తగ్గిన నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రైతుబజార్ల ద్వారా విక్రయించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ్ సునీత అన్నారు. ఉయ్యూరు మండలం చిన ఓగిరాలలో అత్యధిక స్థాయిలో క్యాబేజీ సాగుచేశారు మార్కెట్లో గిట్టుబాటు ధర లేక, కోసిన కనీసం కూలి ఖర్చు కూడా రావడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కమిషనర్ ఆదివారం సాగు చేసిన క్యాబేజీ పంటలను పరిశీలించారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సాగు చేశామని, మార్కెట్లో ధర తగ్గిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి రైతుబజార్లు, మార్కెట్లుకు వస్తున్న క్యాబేజీ దిగుమతులను నిలిపివేయాలని కోరారు. ఈ విషయాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీనివాసరావు సహాయ సంచాలకులు నిత్యానందం, ఉప సంచాలకులు దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించొచ్చు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకుంటే గొప్ప స్థాయికి చేరుకుంటారని రాష్ట్ర బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ జీవి రామచంద్రరావు అన్నారు. గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ 44 వ వార్షికోత్సవ సంబరాలు శనివారం రాత్రి ఘనంగా జరిగాయి. తొలుత కార్యక్రమాన్ని ముఖ్య అతిథి, విశిష్ట అతిథులు జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించగా ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ అధ్యక్షత వహించి ప్రిన్సిపాల్ రిపోర్ట్ లో 2024-25 సంవత్సరం లో పాలిటెక్నిక్ జిల్లా స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు సాధించిన విజయాలు, వివిధ సామాజిక కార్యక్రమాలలో పాల్గొన్న విజయాలు వివరించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే గొప్ప గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని, అంతేకాకుండా విద్యార్థులు మొదట క్రమశిక్షణను అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం 2021-24 సంవత్సరంలో ఉత్తీర్ణులైన వారిలో బ్రాంచ్ టాపర్స్ కు బంగారు పతకాలను అందచేశారు. అలాగే 2024 -ఈసెట్ లో టాప్ ర్యాంకులు సాధించిన వారికీ నగదు పారితోషకాలతో ప్రోత్సహించారు. అలాగే 2021-24 లో పాలిటెక్నిక్ విద్యాలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఓవరాల్ పాలిటెక్నిక్ టాపర్ గా నిలిచిన కుమారి ఆలూరి లలిత కోమలి, బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ గా , వివిధ స్థాయిల ఆటల పోటీలలో విశేష ప్రతిభ కనబరిచిన భూక్యా జయ కుమార్ ని పాలిటెక్నిక్ క్రీడా క్రీడాకారుడిగా గుర్తించి జ్ఞాపికను ముఖ్య అతిథుల చేతులు మీదుగా అందించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించంగా ఈ కార్యక్రమానికి సూరపనేని వెంకటరత్నం, డాక్టర్ పి శ్రీహరి, యాజమాన్య సభ్యులు, ప్రెసిడెంట్ వల్లభనేని సుబ్బారావు , సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ వి.సత్యనారాయణరావు, కో-సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ వి.రామకష్ణ, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. కరుణ కుమార్, ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.లక్ష్మణరావు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

కొండాలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు తెలిపారు. సుమారు 20వేల మంది యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి వారి మొక్కుబడులను తీర్చుకున్నారు. యాత్రికులు దర్శనం చేసుకునేందుకు తగు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గుడ్లవల్లేరు ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలి

ప్రజాశక్తి - తిరువూరు : కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజక వర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పిడిఎఫ్ బలపర్చిన కె.ఎస్.లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు తిరువూరు పట్టణంలో, గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజా గొంతుక లక్ష్మణరావుకు మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. **జగ్గయ్యపేట:** కృష్ణ, గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టబభద్రుల నియోజకవర్గ ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, పెన్షనర్లు, నిరుద్యోగ, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులు, వివిధ ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ మండలంలోని జయంతిపురం వేదాద్రి బండిపాలెం గ్రామాల్లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ నిరంతరం కార్మికులకు, ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు అందుబాటులో ఉండే వ్యక్తి ప్రజల కోసం పోరాటం చేసే వ్యక్తి కెఎస్.లక్ష్మణరావు అని, అధికారం ఉన్న లేకపోయినా కార్మికుల కోసం, ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం నిత్యం పోరాడే ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వెసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కోటా రవికుమార్, కాకనబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **వత్సవాయి :** కృష్ణా గుంటూరు జిల్లాల ఉమ్మడి గ్రాడ్యుయేట్ నియోజకవర్గం పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు గెలుపు కోరుతూ ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని కన్నెవీడు గ్రామంలో సిఐటియు మండల కార్యదర్శి బి.రాము, వ్యవసాయ కార్మిక సంఘం మండల బాధ్యులు కె.రత్నబాబు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. గ్రామాల ఓటర్‌ని కలిసి ఫస్ట్ ప్రాధాన్యత కేసు లక్ష్మణరావుకు ఇవ్వాలని కోరారు. కెఎస్.లక్ష్మణరావు పిడిఎఫ్ తరపున 2007, 2009, టీచర్ ఎమ్మెల్సీగా, 2019 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలుపొంది, కృష్ణా గుంటూరు జిల్లాలో నిర్మాణాత్మక కృషి చేశారని తెలిపారు. **కంచికచర్ల :** ఎంఎల్‌సి లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఓటర్లు తమ ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి లక్ష్మణరావును గెలిపించాలని కోరారు. ప్రజా గొంతుక లక్ష్మణరావును గెలిపిస్తే ప్రజల గొంతును ఆయన వినిపిస్తారని అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కారానికి లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని కోట కళ్యాణ్ అన్నారు.


తిరువూరులో ప్రచారం చేస్తున్న దృశ్యం


కంచికచర్లలో ప్రచారం చేస్తున్న దృశ్యం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

వైద్య శిబిరానికి 1050 మంది హాజరు

ప్రజాశక్తి - తిరువూరు :

జనవిజ్ఞానవేదిక (జెవివి) తిరువూరు కమిటీ ఆధ్వర్యంలో గత 11 సంవత్సరాలుగా స్థానిక నాగార్జున పాఠశాలలో నిర్వహిస్తున్న బిపి, షుగర్, పిట్స్ రోగుల వైద్య శిబిరానికి తిరువూరు, మైలవరం నియోజక వర్గాల నుండే కాకుండా సరిహద్దు ఖమ్మం జిల్లాల నుండి 1050 మంది రోగులు హాజరయ్యారు. వీరికి రెండు నెలలకు సరిపడ మందులను అందచేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ బిపి, షుగర్ కేవలం మందుల వాడకంతోనే నియంత్రణలో ఉండవని, సరైన ఆహార నియమాలు పాటించాలని, ఒక్కపూట తప్పనిసరిగా తృణ ధాన్యాల వాడాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్లు రామకోటేశ్వరావు, సత్యతేజ, రవీంద్ర, లక్ష్మణరావు, వాహినీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వాలంటీర్లు, జనవిజ్ఞాన వేదిక సభ్యులు సేవ లందించారు.



నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - వత్సవాయి :

గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో డెమొక్రటిక్ పిఆర్‌టియు మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డిపిఆర్‌టియు రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుల ముక్క సత్యనారాయణ రాష్ట్ర కార్యదర్శి ఎం.మల్లేశ్వరరావు జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి ప్రభాకర్ అధ్యక్షతన ఎన్నికల నిర్వహించారు. డిపిఆర్‌టియు మండల శాఖ అధ్యక్షుడిగా రేమిడాల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జక్క రవీంద్రనాథ్, కోశాధికారిగా కె.శ్రీకాంత్ మహిళా కార్యదర్శిగా చిట్టి పోతుల కరుణ ఎన్నికయ్యారు. అనంతరం మన స్వీకారం చేశారు. రాష్ట్ర అసోసియేషన్ ముక్క సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గాలు చూపటంతో డిపిఆర్టీయు చురకైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. మండలంలో అతి తక్కువ కాలంలోనే యూనియన్ బలపడిందని వివరించారు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ జాన్, వెంకటప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

డిపిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శిగా యండ్రాతి మల్లేశ్వరరావు

విజయవాడ గాంధీ నగర్‌లో డిపిఆర్‌టియు రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో డిపిఆర్‌టియు 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఏపీ ఎన్జీవోస్ చైర్మన్ కె.వి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.విద్యాసాగర్ లయన్ ముప్పులూరి ఉపేంద్ర పాల్గొన్నారు. సంఘ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించిన యండ్రాతి మల్లేశ్వరావుని డిపిఆర్‌టిఒ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. మర్రి ప్రభాకర్ కౌన్సిలర్ అజ్మీర్ శ్రీనివాసరావు, మండల నాయకులు మల్లేశ్వరరావు అభినందించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - వత్సవాయి : విద్యార్థుల కోసం డెమోక్రటిక్ అందించిన స్టడీ మెటీరియల్‌ను సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మల్లేశ్వరరావు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శైలజకు అందజేశారు విద్యార్థులుకు పంపిణీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాల సమస్యల పోరాటమే కాకుండా సేవా కార్యక్రమాల్లో కూడా పిఆర్టియు ముందంజలో ఉండటం చాలా సంతోషదాయకం అన్నారు. జిల్లా నాయకులు మొక్క సత్యనారాయణ, మరి రాజశేఖర్, మాట్లాడుతూ తమ యూనియన్ తరపున భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరావు, నరేష్, పుల్లయ్య వేగినేటి రమణ, బయ్యారపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సామినేని కంటి ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని జె ఆర్ సి కాలేజీ రోడ్డులో ప్రముఖ కంటి వైద్య నిపుణులు సామినేని దీపక్ ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసిన "సామినేని కంటి హాస్పిటల్" ప్రారంభోత్సవంలో ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరావు వేర్వేరుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాపు రాక్స్ ఫౌండర్ పెద్దిరెడ్డి శివభాస్కర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, మాజీ కౌన్సిలర్ డా.చారుగుండ్ల కొండ, న్యాయవాది రాము, దాచేపల్లి శ్రీనివాసరావు, జగ్గయ్యపేట పట్టణ పార్టీ అధ్యక్షులు వట్టెం మనోహర్, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థాన మాజీ డైరెక్టర్ నంబూరి రవి, మాజీ పట్టణ పార్టీ అధ్యక్షులు చౌడవరపు జగదీష్, ఎల్ఐసి రిటైర్డ్ ఎంప్లాయ్ అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.


ఆస్పత్రి ప్రారంభించిన సామినేని

డంపింగ్ యార్డులా మునేటితీరం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణ శివారు మునేటి తీరం పరిసర ప్రాంతాలు డంపింగ్ యార్డును తలపి స్తున్నాయని నందిగామ మునేటి తీర ప్రాంత ప్రజలు ఆరోపి స్తున్నారు. చెత్త ఇతర వ్యర్థాలను రహదారి వెంట వేసి కాల్చడంతో దట్టమైన పొగ వ్యాపించడంతో వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. నిత్యం ఈ మార్గం గుండా తెలంగాణ రాష్ట్రం మధిర వైపు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. సంబంధిత అధికారులు స్పందించి చెత్త సమస్యకు పరిష్కారం చూ పాలని స్థానికులు వాహన దారులు కోరు తున్నారు. నందిగామ పురపాలక సంఘం డంపింగ్ యార్డ్ సత్యవరం కొండల వద్ద ఉంది. గతంలో పురపాలక సంఘం చెత్త అంత అక్కడికి తరలించేవారు. ఈ మధ్య ఏమైందో కానీ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది మధిర రోడ్డులో చిన్న బ్రిడ్జి, పెద్ద బ్రిడ్జి వద్ద పోస్తున్నారు. ఈ చెత్తను తగులబెడు తున్నారు. దీంతో దుర్గంధంతో పాటు విపరీతమైన పొగరావడంతో అటువైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పురపాలక సంఘం అధికారులు నందిగామ పట్టణంలో స్వీకరించే చెత్తను పల్లగిరి గట్టు మధ్య ఉన్న డంపింగ్ యార్డ్‌కి తరలించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై నందిగామ పురపాలక సంఘం కమిషనర్ స్పందిస్తూ తాము పట్టణంలో సేకరించే చెత్తను డంపింగ్ యార్డ్‌లోనే డంపు చేస్తున్నామని, కొంత చెత్తను గుం టూరు సమీపం లోని జిందాల్ కం పెనీకి పంపిస్తున్నట్లు తెలి పారు. కొంతమంది వ్యక్తులు ఫంక్షన్ తాలూకు వ్యర్థాలను కొబ్బరి బోండాలను ఇతర చెత్తాచెదారాన్ని అక్కడ పోస్తున్నారని తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై నిఘా ఉంచి తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



ఉద్యోగం పేరుతో మోసం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు గ్రామానికి చెందిన కారుపాటి జయకుమార్ తనకు ఉద్యోగం ఇప్పిస్తానని రూ.5 లక్షల నగదు, మరికొన్ని బంగారు ఆభరణాలు తీసుకొని మోసం చేశాడని జగ్గయ్యపేట పట్టణానికి చెందిన కె.పూర్ణిమ అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై రాజు తెలిపిన సమాచారం మేరకు పట్టణంలోని విలియంపేటకు చెందిన పూర్ణిమ ఎంబీఏ చదువుకున్నారు. ఆమె ఉద్యోగాన్వేషణలో ఉండగా 2022 సంవత్సరంలో చిల్లకల్లు గ్రామానికి చెందిన కారుపాటి జయకుమార్ తాను సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ గా పరిచయం చేసుకోవడంతో పాటు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ద్వారా ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పాడు. అందుకు ఉన్నతాధికారులకు డబ్బులు ఇవ్వాలని విడతల వారీగా బ్యాంకు ఖాతాల ద్వారా రూ.5 లక్షలు జమ చేయించుకున్నట్లు పూర్ణిమ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నెట్టెం, రాజగోపాల్‌ను కలిసిన మున్సిపల్ చైర్ పర్సన్ దంపతులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

ఎన్టీ ఆర్ జిల్లా తెలుగు దేశం పార్టీ అధ్య క్షులు, మాజీ మంత్రి నెట్టెం రఘు రామ్, స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ ను వేరువేరుగా ఆదివారం నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కష్ణ కుమారి భర్త శ్రీనివాసరావుతో కలిసి పట్టణంలోని నెట్టెం రఘురాం, రాజగోపాల్ నివాసాలకు వెళ్లి మర్యాద పూర్వకంగా కలి సారు. ఈ సందర్భంగా రఘురామును దుస్సాలువా, పుష్పగుచ్చం ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్ర మంలో వారి వెంట పార్టీ నేతలు సజ్జ అజయ్, కొల్లూరు వెంకటేశ్వర రావు, మేడి కాశీయ్య, కమ్మ గోపి తదితరులు ఉన్నారు.

విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

ఈ నెల 27న జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల నిఘా వేధిక రాష్ట్ర కన్వీనర్, సామాజికవేత్త కర్లపాటి వెంకట శ్రీనివాసరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ ఓటర్లు కుల, మతాల కతీతంగా, ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా, పట్టభద్రుల సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తిని ఎంచుకోవాలని సూచించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించాలి

ప్రజాశక్తి - వత్సవాయి :

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను గుర్తించడంలో అంగన్వాడీ కార్యకర్తలు అవగాహన కలిగి ఉండాలని భవిత సెంటర్ ఉపాధ్యాయులు లీలావతి, శివ పార్వతి, సూచించారు, మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. వికలాంగుల స్క్రీనింగ్, చేరిక, వ్యూహాలను వివరించారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఉషారాణి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ చికెన్..!

• బర్డ్‌ఫ్లూ ప్రభావంతో తగ్గిన విక్రయాలు





ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో చికెన్ అమ్మకాలు తగ్గుముఖం పట్టాయి. బర్డ్ ఫ్లూతో పాటు మాఘ మాసం వలన చాలామంది మాంసాహార ప్రియులు సైతం చికెన్ జోలికి వెళ్లటం లేదు. జిల్లాలో రోజుకు సగటున 50మెట్రిక్ టన్నుల చికెన్ విక్రయాలు జరిగేవి. వారంలోనే విక్రయాలు సగానికి పైగా పడిపోయాయి. ప్రస్తుతం దాదాపుగా 20 టన్నులు కూడా అమ్ముడు పోవటం లేదంటే పరిస్థితి ఎంత అగమ్యగోచరంగా ఉందో అర్థం చేసు కోవాలి. ఇలాగే కొనసాగితే దుకాణాలు మూత వేసుకోవలసిందేనని వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో లేయర్, బ్రాయిలర్ పౌల్ట్రీ పరిశ్రమలు 145 ఉన్నాయి. వీటి ద్వారా ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని సుమారు 14వేల కుటుంబాలకు ఉపాధి ఉంటుంది. అయితే ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో వారం రోజులుగా చికెన్ విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. పది రోజుల క్రితం వరకు కేజీ చికెన్ రూ.220 నుంచి రూ.230 వరకు అమ్మకాలు జరిగాయి. ప్రస్తుతం కిలో రూ.170 నుంచి రూ.180వరకు విక్రయిస్తున్నారు. లైవ్ కోడి రూ.80 పలుకుతుంది. కోడి గుడ్డు ధర కూడా రూ.7 నుంచి రూ.4.50కు పడిపోయింది. దీనితో జిల్లాలో 20లక్షల గుడ్ల అమ్మకాలు ఉండే వ్యాపారం 10 లక్షలకు తగ్గుముఖం పట్టింది. అత్యవసర సమావేశాలు జిల్లాలో పశుసంవర్ధక శాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చికెన్ దుకాణదారులతో ఎక్కడికి ఎక్కడ సమావేశాలను నిర్వహిస్తున్నారు. బయటి నుంచి వచ్చే చికెన్ దిగుమతులపై కట్టడి చేశారు. ఉభయగోదావరి, ఎన్టీఆర్ జిల్లాల్లో బర్డ్ నేపథ్యంతో దిగుమతులు చేయకుండా నిలిపివేశారు. చికెన్ దిగుమతి ఏ ప్రాంతం నుంచి చేసుకున్న ఆ ప్రాంతానికి చెందిన వెటర్నరీ వైద్యాధికారి ఇచ్చిన ధ్రువీకరణ పత్రం ఆధారంగానే చికెన్ దిగుమతులకు వెటర్నరీ అధికారులు అనుమతి ఇస్తున్నారు.

చికెన్ విక్రయాలు తగ్గాయి

షేక్ బాషా మాంసాహార దుకాణదారుడు

చికెన్ కంటే మటన్ మాంసాహార ప్రియులు కొనుగోళ్లలో ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నారు. బర్డ్ ఫ్లూ భయంతో చికెన్ జోలికి అసలు వెళ్ళటం లేదు. ఇప్పటికే సగం పైగా చికెన్ వ్యాపారులు తగ్గిపోయాయి. మటన్ రూ 800 ఉన్నా అది తినేందుకే కస్టమర్స్ ఇష్టపడుతున్నారు. కిలో చికెన్ ధర రూ 220 నుంచి రూ 180కు పడిపోయినా పది రోజులుగా చికెన్ ని అమ్మకాలు తగ్గాయి. మన ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ లేదని చికెన్ తినవచ్చని అధికారులు చెప్పినా చికెన్ పీలు సాహసం చేయటం లేదు. హదయం పెంటాడటంతో చికెన్ అమ్మకాల కంటే మటన్ నమ్మకాలు అధికమయ్యాయి.

జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావం లేదు

డాక్టర్ నరసింహులు, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు. 100 డిగ్రీల సెంటిగ్రేట్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో మాంసాన్ని ఉడికిస్తే చికెన్ వలన ఎలాంటి వ్యాధులు ప్రభావం మనపై ఉండదు. ఈ వైరస్ 70 డిగ్రీల సెంటిగ్రేట్ వరకే బతకగలదు. అందువలన భయపడాల్సిన అవసరం లేదు. కోడిగుడ్లు బాగా ఉడికించి తినవచ్చు. ఈ వ్యాధి ప్రభావం ఉన్న ప్రాంతాల వరకే చికెన్ వాడకూడదు. అలాంటి ప్రాంతాల నుంచి చికెన్ దిగుమతి కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని ప్రతి కోళ్ల పరిశ్రమ, చికెన్ సెంటర్లు మా శాఖ సిబ్బంది వెళ్లి తనిఖీలు చేసి సూచనలు సలహాలు చేస్తున్నారు.



బచ్చు మాధవరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

మాధవరావుకు నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : జనసేన పార్టీ నాయకులు బచ్చు శ్రీహరి తండ్రి, మోదుమూడి పాల కేంద్రం మాజీ అధ్యక్షులు కీర్తిశేషులు బచ్చు మాధవరావు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఆయనకు ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు నివాళులర్పించారు. ఆదివారం ఆయన మోదుమూడి వెళ్లి ఆయన ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాధవరావు చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు బచ్చు వెంకటన్నాథ్, గుడివాడ శివరావు, కొండవీటి శ్రీనివాస్, అశ్వరావు పాలెం ఉపసర్పంచ్ ఎక్కటి నాగరాజు పాల్గొన్నారు.

18న టెన్నిస్‌బాల్ క్రికెట్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-ఉంగుటూరు : కృష్ణా జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18న ఉంగుటూరు మండలం పెద్ద ఆవుటపల్లి హై వే క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి కృష్ణా జిల్లా మహిళలు, పురుషుల జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి ధనియాల నాగరాజు ఆదివారం తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను మార్చి 11 నుండి నాగపూర్ లో జరుగబోయే జాతీయ స్థాయి టి.20 టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులుఎంపిక సమయానికి ఒరిజినల్ ఆధార్ కార్డుతో హాజరు కావాలని ఆయన కోరారు. వివరాలకు 94907 98909 నంబర్‌లో సంప్రదించాలని నాగరాజు తెలిపారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుడివాడ : లక్ష్మీ పెరుమాళ్ళ, ప్రభావతి దంపతులు, చౌదరి రాయన్‌ల జ్ఞాపకార్థం ఆదివారం రోటరీ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో స్థానిక కోతి బొమ్మ సెంటర్లోని ప్రభావతి గార్డెన్స్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని లైన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ అధ్యక్షుడు రాజశేఖర్ ప్రారంభి మాట్లాడుతూ ప్రతి నెల మూడవ ఆదివారం పేదల కోసం ఉచితంగా ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ. సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్స్ డాక్టర్ పి.సూర్యచంద్రరావు, గుళ్ళపల్లి కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మహాత్మా గాంధీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 1979-80 వ సంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక హైస్కూల్‌లో జరిగినది. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు 60 మంది పాల్గొని వారు ప్రస్తుతం చేస్తున్న విధి నిర్వహణ వివరాలను, అదేవిధంగా ఘంటసాల లోని ఉన్నత పాఠశాలలో వారు చదువుకొన్నప్పటి ఆత్మీయ అనుబంధాలను పంచుకున్నారు. అనంతరం ఈ సమావేశం లో పాల్గొన్న అప్పటి విద్యార్థినీ విద్యార్థులు వారికి విద్య నేర్పిన గురువులు వేములపల్లి బాబు రాజేంద్రప్రసాద్, వడ్లమడుగు వెంకట కృష్ణారావు, వేమూరి విశ్వేశ్వరరావు, దోనేపూడి వెంకటరత్నంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ప్రధానోపాధ్యాయులు పోతన వెంకటేశ్వరరావు నిర్వహించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-మంగళగిరి : గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుమ్మడి పుల్లేశ్వరరావు మెమోరియల్ గుంటూరు డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ మరియు బెంచ్ ప్రెస్ (మెన్ %డ% వుమెన్) ఛాంపియన్ షిప్ 2025 పోటీలు ఆదివారం మంగళగిరి వైష్ణవి కళ్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగ ఏపీ మెడికల్ సర్వీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మాజీ ఆప్కో చైర్మన్ మరియు మంగళగిరి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్. రంగశెట్టి నరేంద్ర, గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్ ఎన్ వంశీకష్ణ, అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని, వైస్ ప్రెసిడెంట్ పి భాస్కరరావు, బి ప్రసాద్, బోలినేని చంద్రిక, ఘట్టమనేని సాయిరేవతి ఎస్కే మస్తాన్ వలి, పవన్ కుమార్, సందీప్, ఎన్టీఆర్ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరరావు, పల్నాడు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి పసుపులేటి సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలలో 200 మంది గుంటూరు జిల్లా పవర్ లిఫ్టర్స్, పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి : పల్లెటూరు చారిటబుల్ ట్రస్ట్ వితరణతో క్రీడాకారులకు ఏపీ ఎంఎస్ ఐడీసీ చైర్మన్ చల్లపల్లి శ్రీనివాసరావు ఆదివారం క్రికెట్ కిట్ అందజేశారు. తాడేపల్లి ప్రెస్ క్లబ్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడాకారులు మరింతగా ప్రతిభ కనబరిచి రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జొన్న రాజేష్, అంబటి తిరుపతిరావు, సామల నాగేశ్వరరావు, బి కోమలి, అవినాష్, పి మధు, దినేష్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు, అనంతరం చైర్మన్ నుఘనంగా సత్కరించారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్ష లు

ప్రజాశక్తి-తాడేపల్లి : కోర్టు తీర్పుల ప్రకారం తమ న్యాయంగా రావలసిన బకాయిలుకోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 75 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో వై యహెూశోవ, కే అక్కయ్య, వి లక్ష్మి, డి రమణ, బి నవనీత కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కొరుపాటి స్టీవెన్, కే ఆదినారాయణ ప్రారంభించారు. ఎం ఆశీర్వాదం, బి అంకయ్య, ఎస్.కె కాసిం, జి వెంకటేశ్వర్లు, ఎం సాంబశివరావు, చిన్న పున్నారావు, కే రవికుమార్, టి దుర్గ భవాని, వి రిబ్కా, వి రాణి, ఎస్.కె ఆరిఫ్, వై రమాదేవి, ఈ సారమ్మ, ఎం శివకుమారి తదితరు లు పాల్గొన్నారు.



స్వచ్ఛతతోనే ఆరోగ్యవంతమైన సమాజం

ప్రజాశక్తి-గన్నవరం : స్వచ్ఛత మన ఆరోగ్యానికి ఎంతో ముఖ్యమని గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శారమ్మ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ధ్ర కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శారమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచ కోవాలన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను దష్టిలో పెట్టుకుని అందరు పర్యావరణ పరిరక్షణకు కషి చేయాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరు తమవంతు భాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో అందరు భాగస్వాములు కావాలన్నారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో నీట మునిగిన మినప పంట

ప్రజాశక్తి-నందివాడ : ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యానికి నందివాడ మండలం జనార్ధనపురంలో మినప పంట నీట మునిగింది. అధికారులు చేసిన తప్పిదానికి నష్టపోయిన రైతు అధికారులపై చర్యలు తీసుకోని తనను ఆదుకోవాలంటూ విజ్ఞప్తి చేస్తున్నాడు. దోసపాడు ఛానల్‌లో రైతాంగానికి సమాచారం ఇవ్వకుండా గేట్లు ఎత్తడంతో జొన్నపాడు గ్రామానికి చెందిన రైతు బేతాళ అనిల్ బాబుసాగు చేస్తున్న రెండు ఎకరాల మినప పంట పూర్తిగా నీట మునిగింది. కేవలం చేపల చెరువు కోసమే రైతులకు సమాచారం ఇవ్వకుండా నీరు వదిలారంటూ రైతు ఆరోపిస్తున్నాడు. చేపల చెరువుల యజమానులు ఇచ్చే డబ్బు కోసం అధికారులు చేసిన తప్పిదం వల్ల తాను నష్టపోయానని, చేతికొచ్చిన మినప పంట పూర్తిగా నీట మునిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



నీటమునిగిన పంటను చూస్తున్న రైతు



ఎంపిని కలిసిన కమాండర్ కల్నల్ రితిన్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఎన్సీసీ కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడ గ్రూప్ పరిధిలోని యూనిట్లు, ఎన్సీసీ క్యాడెట్లకు ఇస్తున్న శిక్షణ గురించి వివరించారు. భారతదేశంలోనే అతిపెద్ద ఎన్‌సిసి గ్రూప్ అయిన కాకినాడ గ్రూప్‌కు అసాధారణమైన సామర్థ్యం, అంకితభావంతో నాయకత్వం వహిస్తున్న గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు. రాజమండ్రిలో 300 మందికి పైగా క్యాడెట్‌లకు ఆతిథ్యం ఇచ్చి ప్రత్యేక జాతీయ సమైక్యత శిబిరం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ప్రత్యేక ఎన్‌సిసి అకాడమీ ఏర్పాటు, విపత్తు సంసిద్ధత కోసం స్విమ్మింగ్ పూల్స్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడం, క్యాడెట్లకు శిక్షణ ఇవ్వడం, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన భూమి, నిధులు సంబంధిత సమస్యల పరిష్కారంపై కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ ఎంపీతో చర్చించారు. ఈ సమస్యలను త్వరితగతిన తొలి ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. జాతీయ సేవ, విపత్తు ప్రతిస్పందన, యువ నాయకత్వంలో ఎన్‌సిసి అనివార్య పాత్రను పునరుద్ఘాటించారు. నిరంతర మద్దతు, మౌలిక సదుపాయాల పురోగతితో, కాకినాడ ఎన్‌సిసి గ్రూప్ దేశానికి దోహదపడే క్రమశిక్షణ, సామర్థ్యం, సేవా భావంతో కూడిన క్యాడెట్లను తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు సాగుతుందని కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ తెలిపారు.

నేడు హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఈ నెల 21,22,23 వ తేదీలో కర్నూల్‌లో జరిగే 9వ రాష్ట్ర స్థాయి సీనియర్ బాలికల, జూనియర్ బాలుర హ్యాండ్ బాల్ పోటీలకు ఈ నెల 17వ తేదీ సోమ వారం కృష్ణా జిల్లా జట్టు సెలక్షన్ ట్రైల్స్ జరుగుతుందని కృష్ణా జిల్లా హ్యాండ్ బాల్ కార్యదర్శి ఎస్.వంశీ కృష్ణ ప్రసాద్ ఒక ప్రకట నలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు సోమవారం ఉదయం కె.బి.ఎస్. కళాశాలలో సంప్రదించవచ్చని తెలిపారు.

ఎన్‌సిసి సర్టిఫికెట్ పరీక్ష

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : దేశ వ్యాప్తంగా నేడు ఎన్‌సిసి సర్టిఫికెట్ రాత పరీక్షను నిర్వహించారు. కాకినాడ గ్రూప్ పరిధిలో ఎన్సీసీ యూనిట్లకు నేడు విజయవాడలోని నలంద విద్యానికేతన్, పీబీ సిద్దార్థ కళాశాల, ఆంధ్రా లయోల కళాశాలలో రాత పరీక్షను నిర్వహించారు. కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ నేతృత్వంలో పరీక్షలు జరిగాయి. నిన్న సి సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించగా నేడు రాత పరీక్షను నిర్వహించారు. ఎన్సీసీలో మూడేళ్ళ పాటు శ్రమించి నేర్చుకున్న పలు అంశాలకు సంబంధించి నిర్వహించిన పరీక్షకు క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొని పరీక్ష రాశారు. నలంద విద్యానికేతన్‌లో ఫోర్ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బలిందర్ సింగ్ పర్యవేక్షణలో నిర్వహించిన రాత పరీక్షలో 16, 17 బెటాలియన్‌కు చెందిన 280 మంది ఎన్సీసీ క్యాడెట్లు పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ మాట్లాడుతూ విజయవాడలో మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామని, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పరీక్ష రాశారన్నారు.



ఆకట్టుకున్న తెలుగు చిత్రకళా ప్రదర్శన

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థుల్లో అద్భుతమైన సృజనాత్మకత ఉందని దానిని వెలికితీసి మంచి ఉన్నత వంతులుగా తీర్చిదిద్దాలని ప్రముఖ తెలుగు రచయిత డాక్టర్ వి.సత్యవతి అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, తెలుగు చిత్రకారులు దామెర్ల రామారావు శత వర్ధంతిని పురస్కరించుకుని ఆర్ట్ మేట్ విద్యార్థులచే తెలుగు భాషపై వేసిన చిత్రాల ప్రదర్శన ఆదివారం గురునానక్ కాలనీలోని ఆర్ట్ మేట్ సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ చిత్రకళా ప్రదర్శనను రచయిత సత్యవతి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తెలుగు భాషపై మొదటిసారిగా చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేయడం పట్ల విద్యార్థులను అభినందించారు. మన తెలుగు భాషను పరిరక్షించుకోవడంతో పాటు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం పట్ల విద్యార్థులకు మాతృ భాషాపై ప్రేమ కలుగుతుందని అన్నారు. ఆర్ట్ మేట్ చిత్రకళ సంస్థ డైరెక్టర్ ఎ.సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చిత్రకళ పట్ల ఆసక్తిని కల్పించడంతో పాటు మన సంస్కృతిని తెలియచేడం ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు పిన్ననేని మురళీకృష్ణ శ్రమపై చిన్నారులు గీసిన చిత్రాలను చూసి అభినందించారు. సీనియర్ చిత్రకారులు పావులూరి చిదంబరం తెలుగుపై రాసిన సత్యవతి కవితకు అప్పటికప్పుడు అద్భుతంగా చిత్రించి చూపించారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో అమరావతి బాలోత్సవం కార్యదర్శి ఆర్.కొండల రావు, చిత్రకళ ప్రేమికులు ఎం.మధుసూదనరావు, విజేతలకు బహుమతులు అందచేశారు. సంస్థ సభ్యులు సుధారాణి, సుష్మా, స్వాతి, రజియా, పూర్ణిమ కార్యక్రమాన్ని నిర్వహించారు.



చిత్రకళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న సత్యవతి





సింగ్‌నగర్‌లో మాట్లాడుతున్న రామరాజు



చిత్తరంజన్ గ్రేడ్ -2 గ్రంథాలయంలో చిత్రలేఖన విజేతలు

చిత్రలేఖనం పోటీలు

విజయవాడ : అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్ సహకారంతో చిత్రలేఖనం పోటీలు సింగనగర్ వివేకానంద సెంటినరీ హైస్కూల్లో పెద్ద ఎత్తున జరిగాయి. దాదాపు 650 మంది చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నారు. పోటీల అనంతరం జరిగిన సభకు అమరావతి బాలోత్సవం సింగ్ నగర్ బాధ్యులు సి హెచ్.పద్మ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అమరావతి బాలోత్సవం అధ్యక్షులు ఎస్‌పి రామరాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలంతా ఎంతో ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలో పాల్గొనడం చాలా ఆనందం కలిగించిందన్నారు. పిల్లల చదువుల వెంటే పడకుండా ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా తమ ప్రతిభను వెలికి తీయాలని అన్నారు. మరో ముఖ్య అతిథిగా విచ్చేసిన అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక సంఘం అధ్యక్షులు వెంకటరామరాజు మాట్లాడుతూ ఎంతమంది పిల్లలు చిత్రలేఖనం పోటీల్లో పాల్గొనడం చాలా గొప్ప విషయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు ఈ క్రాంతి ఫోరం ఫర్ ఆర్టిస్ట్ బాధ్యులు ప్రముఖ చిత్రకారులు చిత్రం సుధీర్ సంధ్యారాణి గిరిధర్ తదితరులు న్యాయ నిర్ణేతలుగా పాల్గొన్నారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవం జరిగింది. చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయం సత్యనారాయణపురంలో ఆదివారం చదవటం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా నీకు నచ్చిన చిత్రం అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ విద్యార్థులను గ్రంథాలయ పాఠకులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆలోచనలకు అద్భుత రూపం చిత్ర లేఖనం అన్నారు. ఈ కళకు పరిమితులు లేవని అన్నారు. చిత్ర లేఖనానికి వివిధ రూపాలున్నాయని, సహజత్వాన్ని ప్రతిబింబించే చిత్ర లేఖనం ఒకవైపు అయితే కల్పిత లోకాల్లో మరొకవైపు అన్నారు. భావవ్యక్తీకరణ, మానవ చరిత్ర, సాంప్రదాయాలు, జీవనశైలి వ్యవస్థ ఇలా దేనినైనా ఆవిష్కరించగలిగేది చిత్ర లేఖనం అన్నారు. విద్యార్థుల అభివృద్ధిలో కీలకమైన కళ చిత్ర లేఖనం అన్నారు. భారత జాతి వీరయోధుడు ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని అద్భుతంగా గీసి ప్రథమ ద్వితీయ బహుమతులను ఎ.సుగుణ సుందరి, బి.తులసి గెలుచుకున్నారు.

బర్డ్‌ఫ్లూతో మటన్ ధరకు రెక్కలు

ప్రజాశక్తి - గంపలగూడెం : ఇటీవల ఏపీ తెలంగాణలో బర్డ్ ఫ్లూ వ్యాపించిందన్న ప్రచారంతో అధికారులు చికెన్ దుకాణాలు మూసి వేయించిన విషయం తెలిసిందే. ఇక సగటు మానవుడు వారానికి రెండు లేదా మూడుసార్లు మాంసాహారం లేనిదే ముద్ద దిగని పరిస్థితులు నెలకొన్నాయి. ఇక ఆదివారం ఈ కొనుగోళ్లపై చర్చించాల్సిన అవసరమే లేదు. చికెన్ దుకాణాల మూసివేతతో మటన్, ఫిష్ దుకాణదారులు అడ్డగోలుగా ధరలు పెంచేశారు. గతవారం మటన్ ధర పరిశీలిస్తే రూ.600 లు ఉండగా, అది ఆదివారం రూ.వెయ్యికి పెంచి, ఫిష్ 170 నుండి 180 రూపాయలు ఉండగా అది నేడు 200 నుండి 230 వరకు అమ్మకాలు చేసినట్లు తెలిసింది. దుకాణదారులు, చేపలు కాటా వేసి ఇచ్చే సమయం కూడా లేకుండా వినియోగదారులు వస్తుండటంతో ఇదే అవకాశంగా మలుచుకున్న దుకాణదారులు సుమారు చూసి విక్రయిస్తుండటం కనిపించింది. ప్రతివారం క్వింటాళ్ల స్థాయిలో చికెన్ విక్రయాలు జరుగుతుండగా, ఆ ఎఫెక్ట్ మటన్, ఫిష్‌పై పడిందని, వినియోగదారులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితులు గంపలగూడెం-తోట మూలలో ఉన్న దుకాణాల్లో దర్శనమిచ్చాయి. ఇటువంటి పరిస్థితుల్లో అధికారులు కలగజేసుకొని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.



రద్దీగా ఉన్న మటన్ దుకాణం

కవితల పోటీకి ఆహ్వానం

ప్రజాశక్తి - తిరువూరు : ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తిరువూరులోని ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు తెలుగు భాషలో కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు తిరువూరు రచయితల సంఘం అధ్యక్షురాలు ఉయ్యూరు అనసూయ తెలిపారు. పోటీలో పాల్గొనే అభ్యర్థులు సామాజిక ఇతివృత్తంగా ఏదైనా అంశంపై కవితలను రచించి కళాశాల ప్రిన్సిపాల్ ఇచ్చే ధృవీకరణ పత్రం జతచేసి స్థానిక గ్రంథాలయంలో లేదా స్వాతి టైప్ ఇనిస్టిట్యూట్‌లో స్వయంగా అందజేయాలని తెలిపారు. 9550506829, 9440848924 నంబర్లకు వాట్సాప్‌లో కూడా పంపించవచ్చన్నారు. కవితలు పంపించడానికి గడువు ఈ నెల 20 తేదీ అని ఆమె పేర్కొన్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ దేవాలయాల సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అతిపెద్ద సమావేశమైన ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్, ఎక్స్‌పో (ఐటీసీఎక్స్) ఈ నెల 17 నుంచి 19 వరకు తిరుపతిలోని ఆశా కన్వెన్షన్స్‌లో జరుగనుందని నిర్వాహకులు ఎల్.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరేష్ కులకర్ణి మానస పుత్రిక అయిన ఐటిసిఎక్స్ 2025, అంత్యోదయ ప్రతిష్టాన్ సహకారంతో నిర్వహించబోయే కార్యక్రమంతో దేవాలయ పర్యావరణ వ్యవస్థలను నెట్‌వర్క్ చేయడానికి, బలోపేతం చేయడానికి, ఆధునీకరించడానికి ఒక డైనమిక్ వేదికను రూపొందించనున్నారని అన్నారు. వారి గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని వేడుక జరుపుకుంటుందన్నారు. సదస్సులో 111 మందికి పైగా స్పీకర్లు, 15 వర్క్‌షాప్‌లు, నాలెడ్జ్ సెషన్‌లు, 60 పైగా స్టాల్‌లను కలిగి ఉంటుందన్నారు.



వైద్య శిబిరంలో వైద్య బృందం

675 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కంచికచర్ల : స్థానిక విజయరాణి పాఠశాల పూర్వ విద్యార్థుల బృందం ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 675 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బిపి, షుగర్, డెంటల్, కల్లు, చర్మ, ఎముకలు తదితర రోగాల బారిన పడిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ క్రీస్తు రాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు సామాజిక బాధ్యతలో భాగంగా ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ మెడికల్ క్యాంపులో ఎన్సిసి విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.